క్లుప్తంగా

ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు

జగిత్యాలటౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 17న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బింగి సత్యమ్మ తెలిపారు. అపోలో హోంకేర్ (హైదరాబాద్)లో 50, వరలక్ష్మి ఫౌండేషన్ (హైదరాబాద్)లో 50 ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ, ఎంబీఏ, బీఎస్సీ నర్సింగ్, ఏఎన్ఎం, జీఎన్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ చదివిన వారు అర్హులని తెలిపారు. నెలకు రూ.15 వేల వేతనం ఇస్తారని, ఆసక్తి, అర్హత కలిగినవారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

గ్రామీణ భారత్ బంద్‌లో పాల్గొనాలి

మెట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ భారత్ బంద్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని విజయవంతమయ్యేలా చొరవ తీసుకోవాలని పార్టీ బ్లాక్, పట్టణ, మండలాధ్యక్షులు అల్లూరి మహేందర్‌రెడ్డి, జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



మల్యాలలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మల్యాల: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం మండలం కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, లక్ష్మారెడ్డి, శంకర్‌గౌడ్, సతీశ్‌రెడ్డి, తిరుపతి, లక్ష్మణాచారి, వినయ్, రామాంజనేయులు, ఇమామ్, హరినాథ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఇబ్రహీంపట్నం: మండలంలో ఈజీఎస్ నిధులు రూ.14లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేసి ప్రారంభించారు. తిమ్మాపూర్ గ్రామంలో మల్లన్న దేవాలయం వద్ద ఈజీఎస్ నిధులు రూ.4లక్షలతో సీసీ రోడ్డు, ఇబ్రహీంపట్నం గొనెకాపువాడలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు, ఇబ్రహీంపట్నం హైస్కూల్ ముందు రూ.5లక్షలతో మురుగు కాలువ పనులను ప్రారంభించారు. మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పొనకంటి వెంకటి, ఎంపీటీసీలు తిమ్మణి రాములు, అక్కెనపల్లి జైలేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుదిగం గంగాధర్, సోషల్ మీడియా కోకన్వీనర్ కట్ట మనోజ్, మాజీ ఉప సర్పంచ్ సల్ల సునీల్, నాయకులు రెబ్బటి రాజశేఖర్, ఐలాపురం భూమారెడ్డి, అబ్బటి రాజరెడ్డి, నాచుపెల్లి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి వైద్యానికి ఆర్థిక సాయం



రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రాయికల్: పట్టణానికి చెందిన గట్టుపల్లి రాంబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా.. ఆయనతో పాటు పదోతరగతి చదివిన స్నేహితులంతా కలిసి వైద్య ఖర్చుల కోసం గురువారం రూ.1,00,500 కుటుంబ సభ్యులకు అందజేశారు. మచ్చ శేఖర్, రాచర్ల ఆంజనేయులు, చిలువేరి సురేశ్, భూమి మహేశ్, సాంబారి శ్రీనివాస్, బెజ్జంకి హరికృష్ణ, మండ రమేశ్, శ్రీనివాస్, రాజేశం, సత్తయ్య, రామకృష్ణ, రమేశ్, నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



రాజారాంపల్లితాండాలో వేడుకలు నిర్వహిస్తున్న గిరిజనులు



రాయికల్: ఆల్యానాయక్‌తండాలో పాల్గొన్న ఎంపీపీ, ఎంపీడీవో

పెగడపల్లి: ఏడుమోటలపల్లి, మద్దులపల్లి, రాజారాంపల్లితాండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. చిత్రపటానికి గిరిజన నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: ఆవులో సకల దేవతలున్నారని చాటి చెప్పి సత్ప్రవర్తనతో బాధ్యతాయుతమైన జీవనం గడపాలని సూచించి బంజారాల్లో వలసలను ఆపిన మహనీయుడు సంత్‌సేవాలాల్ మహారాజ్ అని బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా జవహర్‌నాయక్ కొనియాడారు. జిల్లాకేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో ఉన్న బంజారా భవన్‌లో సంత్‌సేవాలాల్ జయంతి వేడుకలను నిర్వహించారు. బంజారా నాయకులు దశరథనాయ్, నునావత్ రాంజీనాయక్, ప్రకాష్ ప్రవీణ్, దేవేందర్‌నాయక్, గంగాధర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని బంజారానగర్‌లో సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బంజారా యువతులు ఆటపాటలతో వేడుకలు జరిపారు. బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దయ్య రఘు, బహుజన నాయకుడు గోరుమంతులు సురేందర్, బంజారా నాయకులు పూల్‌సింగ్, జీజీనాయక్, వెంకటరాములు, లక్ష్మణ్, శంకర్, రాజుబాయ్, లింబాబాయ్, శారద, రూప, మమత, సేవంత, అమృత, నర్సిబాయ్ పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: ఏఎస్ఆర్‌తండాలో మహారాజ్ మందిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిపాల్, రాములు, హర్‌సింగ్, గంగాధర్, రాందాస్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ అని ఎంపీపీ సంధ్యారాణి అన్నారు. ఆల్యానాయక్‌తండా, ధర్మాజీపేటలో సంత్‌సేవాలాల్ జయంతి నిర్వహించారు. బోగు బండార్ కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ ఖయ్యూం, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, నాయకులు దుప్యానయక్, రాజన్న, స్వామినాయక్, రాజేశ్‌నాయక్, గంగారాం, తిరుపతినాయక్ పాల్గొన్నారు.



జగిత్యాలటౌన్: నివాళి అర్పిస్తున్న నాయకులు



కోరుట్లలో పాల్గొన్న భక్తులు



మెట్‌పల్లిరూరల్: ఏఎస్ఆర్‌తండాలో పూజలు చేస్తున్న లంబాడీలు

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ఎంపీడీవోగా మల్లాపూర్ ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎంపీడీవోల బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేసిన ఎంపీడీవో ప్రభు కరీంనగర్ జిల్లా కొత్తపల్లికి బదిలీపై వెళ్లారు. ఇబ్రహీంపట్నంకు ఎంపీడీవోను కేటాయించకపోవడంతో మల్లాపూర్ ఎంపీడీవోకు బాధ్యతలను అప్పగించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.

ధర్మపురి: మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీవోగా పి.రవీందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు ఎంపీడీవోను శాలువాతో సన్మానించారు. జైనా పీఏసీఎస్ చైర్మన్ సొల్ల నరేష్, ఎంపీవో నరేష్‌కుమార్, సీనియర్ సహాయకుడు అజయ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.

బుగ్గారం: మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీవోగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు నర్సాగౌడ్, పెద్దనవేణి శంకర్, జంగ శ్రీనివాస్ తదితరులు సన్మానించారు.



రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్యదర్శులు

రాయికల్: రాయికల్ ఎంపీడీవోగా చిరంజీవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన సంతోష్‌కుమార్ నిజామాబాద్ జిల్లాకు బదిలీ కాగా.. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ఎంపీడీవోగా పని చేసిన చిరంజీవి రాయికల్‌కు బదిలీపై వచ్చారు.

బుగ్గారం: బుగ్గారం పోలీస్ స్టేషన్లో నూతన ఎస్సైగా శ్రీధర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నర్సాగౌడ్, పెద్దనవేణి శంకర్, జంగ శ్రీనివాస్, భారతపు గంగాధర్, అంజిత్‌కుమార్, రహమాన్, రాకేశ్ తదితరులున్నారు.

సీఐని కలిసిన నూతన ఎస్సై

ధర్మపురి: ధర్మపురి పోలీస్ స్టేషన్లో గురువారం నూతన ఎస్సైగా ఉదయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాంనర్సింహరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

బెల్టులు, సర్టిఫికెట్ల పంపిణీ



జగిత్యాల: ప్రతి ఒక్క విద్యార్థి కరాటేలో శిక్షణ పొందాలని, ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగమని తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సంతోష్‌కుమార్ అన్నారు. దేవిశ్రీ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. గంగారాం, రమేశ్, రమ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



ధర్మపురి: ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో కొంతకాలంగా కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రమేశ్ బదిలీపై వెళ్లడంతో గురువారం వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్‌హెచ్ గార్డెన్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు నాగలక్ష్మి, సంతోషి, వేణు, ఉమాలక్ష్మి, పద్మ, అరుణ, విజయలక్ష్మి, అశోక్, మేనేజర్ గంగాధర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్, ఆర్పీలు తదితరులున్నారు.

మల్లాపూర్‌లో సోమేశ్వర దీక్షలు



మల్లాపూర్: మండల కేంద్రం శివారులోని సోమేశ్వర కొండపై గల శ్రీకనక సోమేశ్వర ఆలయంలో గురువారం అర్చకుడు బల్యపెల్లి ప్రభాకర్‌శర్మ భక్తులకు సోమేశ్వర దీక్షధారణ చేశారు. ఆయన మాట్లాడుతూ.. శ్రీకనక సోమేశ్వర స్వామిని పూజిస్తూ భక్తులు సోమేశ్వర దీక్షను స్వీకరించి 21రోజుల పాటు స్వామివారిని నిష్ఠతో, భక్తిశ్రద్ధలతో కొలుస్తారని అన్నారు. శివరాత్రి పర్వదినాన సోమేశ్వర కొండపై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భజన పాటలతో జాగరణ చేస్తారని తెలిపారు. మరుసటి రోజున నిర్వహించే రథోత్సవంతో దీక్ష పూర్తవుతుందన్నారు. 60మంది స్వాములు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

జగిత్యాల: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని మానస స్కూల్ ప్రిన్సిపాల్ రజితరావు అన్నారు. గురువారం మానస స్కూల్ ఎక్స్‌లెన్స్‌లో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు, డైరెక్టర్ హరిచరణ్‌రావు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

కోరుట్లరూరల్: క్రీడాకారులు ఆటల పోటీల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. అయిలాపూర్‌లో క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ద్యావనపెల్లి రాధాకృష్ణా ఆర్థిక సాయంతో నిర్వహించే 52 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ కిరణ్‌కుమార్, అయిలాపూర్ క్రికెట్ క్లబ్ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు


రాయికల్: క్రీడలు స్నేహసంబంధాలను పెంపొందిస్తాయని జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు గురువారెడ్డి, మల్లారెడ్డి అన్నారు. గురువారం అల్లీపూర్ గ్రామంలో ఎంబారి గంగారెడ్డి-లక్ష్మీ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ముగిశాయి. విన్నర్‌గా తిరుమల్ టీం, రన్నర్‌గా ప్రేమ్ టీం నిలిచాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. వివేకానంద స్పోర్ట్స్ క్లబ్‌కు వైద్యులు రూ.30వేలు అందజేశారు. తహసీల్దార్ ఖయ్యూం, మాజీ జెడ్పీటీసీ గోపి మాధవి, రాయికల్ మాజీ సర్పంచ్ ఎద్దండి భూంరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, మండల రవి, రాజిరెడ్డి పాల్గొన్నారు.



పతాకావిష్కరణ చేస్తున్న ప్రిన్సిపాల్

కిక్ బాక్సింగ్ జాతీయ కోచ్‌గా గణేశ్

ధర్మపురి: కిక్ బాక్సింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయి కోచ్ నుంచి జాతీయస్థాయి కోచ్‌గా గణేశ్ ఎంపికైనట్లు గురువారం కిక్ బాక్సింగ్ చీఫ్ ఇన్స్‌స్ట్రక్టర్ కస్తూరి ప్రవీణ్ తెలిపారు. తుమ్మెనాల గ్రామానికి చెందిన మామిడిపెల్లి గణేశ్ ఈనెల 7 నుంచి 11 వరకు న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన 3వ అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు. గణేశ్ తెలంగాణ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరించి జాతీయస్థాయి కోచ్‌గా శిక్షణ పూర్తి చేసుకొని సర్టిఫికెట్ సాధించినట్లు పేర్కొన్నారు. వాకో ఇండియా అధ్యక్షుడు సంతోష్ అగర్వాల్, ఇండియా చీఫ్ కోచ్ సురేష్‌బాబు, తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు అభినందించారు.



జాతీయస్థాయి సర్టిఫికెట్ తీసుకుంటున్న గణేశ్

అల్పాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజు రోగులు, వారి సహాయకుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ కోరుట్ల అధ్యక్షుడు లయన్ వనపర్తి చంద్రమోహన్ కోరారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320జీ వారు నిర్వహించే మీల్స్ ఆన్ వీల్స్‌లో భాగంగా కోరుట్ల లయన్స్ క్లబ్, కోరుట్ల లయన్స్ క్లబ్ కోటి నవదుర్గ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు. 150 మందికి అల్పాహారం అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, జిల్లా హంగర్ రిలీఫ్ కోర్ టీం మెంబర్ ఉష్కాకిరణ్, గుంటుక చంద్రప్రకాష్, కుందారపు మహేందర్, పోతని ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సునీత

రాష్ట్రస్థాయి సమావేశం విజయవంతం చేయాలి

జగిత్యాలరూరల్: నేషనల్ ఉమెన్ రైట్స్ రాష్ట్రస్థాయి సమావేశం విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు నక్క గంగారాం కోరారు. గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేషనల్ ఉమెన్ రైట్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మార్చి 3న హైదరాబాద్‌లో జరిగే నేషనల్ ఉమెన్స్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్రస్థాయి సమావేశానికి ఎన్‌హెచ్ఆర్‌సీ సభ్యులు ఎక్కువ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. అనంతరం కౌన్సిల్ సభ్యులకు ప్రశంస పత్రాలు అందజేశారు. నేషనల్ ఉమెన్స్ కమిటీ కౌన్సిల్ కన్వీనర్ కొక్కుల ప్రభాకర్, జిల్లా యూత్ అధ్యక్షుడు సంతోష్, కన్వీనర్ రవీందర్, పాత మారుతి, వరుణ్, రాథోడ్, కస్తూరి రాజన్న, మహిళా అధ్యక్షురాలు పాత రాణి, ప్రధాన కార్యదర్శి సాతారపు పద్మ, శైలజ పాల్గొన్నారు.



ప్రశంస పత్రాలు అందజేస్తున్న నాయకులు

ముగిసిన పారిశుద్ధ్య కార్యక్రమాలు

కోరుట్లరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో మొదటిసారి నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. వారం రోజులుగా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, బస్టాండ్లు, పల్లె ప్రకృతి వనాల్లో చెత్త తొలగించడం, మురుగు కాలువలు శుభ్రం చేయడం, ఖాళీ స్థలాల్లో ఉన్న పెంట కుప్పలు తొలగించడం, శిథిలావస్థ కట్టడాలు తొలగించడం, పాడుబడ్డ బావులు పూడ్చడం, మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం గ్రామసభలు నిర్వహించి మత్తు పదార్థాలతో కలిగే దుష్ప్రభావాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య పనుల్లో ప్రతిభ కనబరిచిన కార్యదర్శులు, సఫాయి కార్మికులను అధికారులు, ప్రజాప్రతినిధులు శాలువాలతో సత్కరించారు. ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు తహసీల్దార్ కిషన్, డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీవో నీరజ, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో అధికారులు పారిశుద్ధ్య పనులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. డ్రైయినేజీల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి సిబ్బంది తొలగిస్తున్నారు. గురువారం కథలాపూర్‌లో ప్రత్యేకాధికారి అనిల్, కార్యదర్శి నారాయణ పనులను పరిశీలించారు.

గంగరాజం సేవలు మరువలేనివి

మల్లాపూర్: సఫాయి(పారిశుద్ధ్య కార్మికుడు)గా గుజ్జరి గంగరాజం సేవలు మరువలేనివని ప్రత్యేకాధికారి, ఎస్సారెస్పీ ఏఈ రాకేశ్ అన్నారు. సిరిపూర్ పంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో విరమణ పొందిన గంగరాజంను సన్మానించారు. 30 ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికుడిగా బాధ్యతలు చేపట్టిన సఫాయి గంగన్న వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వర్తించాడని తెలిపారు. గంగరాజంకు రూ.4,000 నగదును అందించి అధికారులు, నాయకులతో కలిసి సన్మానించారు. మాజీ సర్పంచులు భూక్య గోవింద్‌నాయక్, నల్ల బాపురెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేష్, నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తల, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కోరుట్లరూరల్: నాగులపేటలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

విద్యార్థులు మంచిగా చదువుకోవాలి

జగిత్యాల: విద్యార్థులు మత్తుకు అలవాటు పడకుండా మంచిగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని లక్ష్మీపూర్ ప్రత్యేకాధికారి కందుకూరి రవిబాబు అన్నారు. గ్రామాన్ని శుభ్రం చేసిన సిబ్బందిని సన్మానించారు. వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్, సెక్రటరీ అజయ్, ఆయుర్వేద ఫార్మాసిస్ట్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సన్మానం..

జగిత్యాలరూరల్: మోరపల్లి గ్రామంలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను ప్రత్యేక అధికారి డాక్టర్ నరేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. సింగిల్‌విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ భూమారెడ్డి, కార్యదర్శి రాజిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెగడపల్లి: గ్రామాలభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి కోరారు. అన్ని పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మల్లాపూర్: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవని తహసీల్దార్ వీర్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో కార్మికులను సన్మానించారు. ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, మాజీ పాలకవర్గ సభ్యులు, నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ మోహన్ హెచ్చరించారు. పట్టణంలోని 6, 9 వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ రత్నాకర్, ముజీబ్, నిజాం తదితరులున్నారు.



జగిత్యాల: సిబ్బందికి సన్మానం

ఇబ్రహీంపట్నం: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలోనే కాదు ప్రతిరోజు గ్రామాలను శుభ్రంగా ఉంచాలని ప్రత్యేకాధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్ అన్నారు. ఇబ్రహీంపట్నం పంచాయతీ ఆవరణలో గ్రామసభలో మాట్లాడారు. కార్మికులను సన్మానించారు. వర్షకొండ గ్రామంలో పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ప్రసాద్ కార్మికులను సన్మానించారు. ఎంపీటీసీ తిమ్మణి రాములు, కార్యదర్శులు సాహినాథ్, రాకేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు రాజశేఖర్‌యాదవ్, తుక్కరాం, నడ్పి రాజన్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మల్యాల: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణతో వ్యాధులు నియంత్రణలోకి వస్తాయని, ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని మల్యాల మేజర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి పి.సురేశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గ్రామసభ నిర్వహించి కార్మికులను సన్మానించారు. యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యదర్శి రవీందర్, మాజీ ఉప సర్పంచ్ పోతరాజు శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యుడు శనిగరపు తిరుపతి, స్థానికులు కటుకం వినయ్, కోరెపు వేంకటేశం, ముదాం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాయికల్: ఆలూరులో తహసీల్దార్ ఖయ్యూం కార్మికులను సన్మానించారు. మాజీ సర్పంచ్ మెక్కొండ రాంరెడ్డి, వెంకటేశ్, నర్సయ్య, సతీశ్, మల్లారెడ్డి, కార్యదర్శి రాజశ్రీ, గోదావరి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



బుగ్గారంలో మాట్లాడుతున్న కుమార్

బుగ్గారం: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేద్దామని ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం ఆధ్వర్యంలో గురువారం అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రంలో నరేంద్రమోదీ గాలీ వీస్తోందని అన్నారు. ఈనెల 20న భైంసా నుంచి బీజేపీ విజయ సంకల్ప యాత్ర ప్రారంభం అవుతుందని, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు కోమల ఆంజనేయులు, మంచె రాజేశ్, చంద్రశేఖర్, బండారి లక్ష్మణ్, అనసూర్య, వివిధ మండలాల అధ్యక్షులు శ్రీధర్ తదితరులున్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

రాయికల్: మైతాపూర్ గ్రామంలోని సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. చైర్మన్ గంగుల శ్రీనివాస్, సభ్యుడు మహిపాల్, ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతర్గత మార్కుల పరిశీలన



రాయికల్: ఇటిక్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు అంతర్గత మార్కులను పర్యవేక్షించారు. విద్యార్థులు రాసిన రికార్డులను తనిఖీ చేశారు. పర్యవేక్షణాధికారి బోగ రమేశ్, సభ్యులు బొమ్మకంటి రవికుమార్, మండలోజు రవీందర్, ప్రధానోపాధ్యాయుడు సదాశివ్, ఉపాధ్యాయులు గాజంగి రాజేశం, సీఎంశర్మ, ఎద్దండి రమేశ్, శాంతకుమారి, జియోద్దీన్ పాల్గొన్నారు.

అత్యధిక మార్కులు సాధించాలి

జగిత్యాల: విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలని ట్రస్మా అధ్యక్షుడు శ్రీధర్‌రావు అన్నారు. ట్రస్మా అధ్యక్షుడిగా ఎన్నికయిన శ్రీధర్‌రావును అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శివసాయిరెడ్డి, సంజయ్, రాహల్ పాల్గొన్నారు.

వృత్తిలో నైపుణ్యం కోసమే శిక్షణ శిబిరాలు



మెట్‌పల్లి: వృత్తిలో నైపుణ్యం పెంపొందించడానికే కార్మికుల కోసం శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు న్యాక్ ట్రెనింగ్ ఆఫీసర్ అలీ పేర్కొన్నారు. పట్టణంలో 60మంది నిర్మాణ రంగ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. వారికి వృత్తి, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లను అందజేశారు. రాజశేఖర్, శిల్ప తదితరులున్నారు.